క్లుప్తంగా

ఉక్కుదీక్షలో భెల్ నాయకులు



రిలే నిరాహార దీక్షలో భెల్ ఇంటక్ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీ కరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలో ఆదివారం భెల్ ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు. ఇంటక్ జిల్లా ప్రధానకార్యదర్శి కె.ఈశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం..కూటమి నాయకులు మేము మాత్రమే విశాఖ ఉక్కును కాపాడగలమని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారన్నారు. తర్వాత ఉక్కు పరిశ్రమను వేగవంతంగా ప్రైవేటీకరణ దిశగా పావులు కదుపుతున్నారన్నారు. దీనిలో భాగంగా విశాఖ ఉక్కులో శాశ్వత ఉద్యోగులను సుమారు 1500 మందిని వీఆర్‌ఎస్ పేరుమీద తొలగించడం, కాంట్రాక్ట్ కార్మికులను 3000 మందిని తొలగించడం, శాశ్వత ఉద్యోగులకు, కాంట్రాక్ట్ కార్మికులకు సుమారు 6 నెలల నుంచి సగం జీతాలు చెల్లించడం దురదృష్టకరం అన్నారు. విశాఖ ఉక్కు అభివృద్ధి చెందడం అంటే కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడం అని అర్థం అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉద్యోగులకు భద్రత కరువైందన్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు ప్రధాని మోదీతో మాట్లాడి ఒప్పించి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి పరిశ్రమకు సొంత గనులను కేటాయించాలని లేదా సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భెల్ ఇంటక్ యూనియన్ నాయకులు వారాడ ఆనందరావు, సీతన్‌నాయుడు, సీహెచ్.మురళీశ్వరరావు, ఇంటక్ జిల్లా ప్రధానకార్యదర్శి బోగవిల్లి నాగభూషణం పాల్గొన్నారు.

మంచిగా నడుచుకోండి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ చంద్రశేఖర్

మర్రిపాలెం: తగాదాలు, గొడవల జోలికి పోకుండా రౌడీషీటర్లు మంచిగా నడుచుకోవాలని కంచరపాలెం ఐదో పట్టణ సీఐ చంద్రశేఖర్ సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి నేరాల జోలికి వెళ్లినా ఊరుకునేది లేదని హెచ్చరించారు. రౌడీషీటర్లపై ఎల్లప్పుడూ పోలీస్ నిఘా ఉంటుందన్నారు. హద్దు మీరి ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరిస్తూ.. కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జీవించాలని సూచించారు.

10న పైడితల్లి అమ్మవారి పండగ



పండగ తేదీని ఖరారు చేస్తూ దేవస్థానం ఏఈవోకు లేఖ అందిస్తున్న లండ వెంకటరమణ, గ్రామస్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగ ఈ నెల 10న జరగనుంది. సింహాచలం కొండదిగువ శ్రీనృసింహ సదనంలో పండగ నిర్వహణపై అడవివరం గ్రామ పెద్దలు, పైడితల్లి అమ్మవారి పూజారి వంశీయులు, ఉత్సవ కమిటీ నాయకులతో సింహాచలం దేవస్థానం అధికారులు ఆదివారం సమావేశమయ్యారు. అమ్మవారి పండగ నిర్వహణ తేదీని అమ్మవారి వ్యవస్థాపక పూజారి కుటుంబ సభ్యుడు లండ వెంకటరమణ ప్రకటించారు. ఈ నెల 2న పైడితల్లి దేవర(పుట్టమన్ను), ముత్యాలమ్మ దేవర(పుట్టమన్ను)ను తెచ్చే కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 3న ముత్యాలమ్మ పండగ, 9న పైడితల్లి పండగ తొలేళ్ల మహోత్సవం, 10న పండగ మహోత్సవం, 17న మారువారం పండగను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దేవ స్థానం చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. 9న జరిగే తొలేళ్ల ఉత్సవానికి సంబంధించి దేవస్థానం ఏర్పాటుచేసే సాంస్కృతిక కార్యక్రమం పెద్ద ఎత్తున ఉండాలన్నారు. అమ్మవారి ఆలయానికి సాయినగర్‌లో భూమిని కాపాడాలని, అమ్మవారికి భక్తులకు సమర్పించే బంగారం, వెండి వివరాలను దేవస్థానం బహిర్గతం చేయాలని కోరారు. ఏఈవో ఆనంద్ మాట్లాడుతూ పండగ నిర్వహణపై గ్రామస్తులు కోరిన ప్రతి అంశానికి దేవస్థానం నుంచి అభ్యంతరం ఉండదన్నారు. బంగారమ్మ ఆలయానికి ప్రహరీ నిర్మాణానికి అంచనాలు రూపొందించామన్నారు.

అసంపూర్తి పనులు.. అష్టకష్టాలు



రోడ్డుకు ఇరువైపులా కాలువ లేక రోడ్డుపై నిలిచిన వర్షపునీరు (ఫైల్)



కాలువలు లేకపోవడంతో సేవా మార్గం దుస్థితి (ఫైల్)

- సగంలో నిలిపేసిన కాలువ పనులు
- వర్షాలు కురవడంతో నిలిచిపోతున్న నీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మల్కాపురం: జీవీఎంసీ చేపట్టిన అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉండటం వల్ల వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా, పారిశ్రామిక ప్రాంతంలోని జింక్ ప్రధాన గేటు నుంచి సింధియా జంక్షన్ వరకు చేపట్టిన సర్వీస్ రోడ్డు విస్తరణ పనులు, ఫుట్‌పాత్‌లు, వర్షపు నీటి కాలువల నిర్మాణం సగం, సగమే జరగడంపై ప్రజల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. సుమారు పది కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన ఈ పనుల్లో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

అసంపూర్తిగా కాలువ పనులు

సర్వీస్ రోడ్డు, ఫుట్‌పాత్ నిర్మాణం పూర్తిస్థాయిలో జరిగినప్పటికీ, రోడ్డుకు ఇరువైపులా నిర్మించాల్సిన కాలువల పనులు మాత్రం అసంపూర్తిగా వదిలేశారు. కొన్ని చోట్ల కాలువలు నిర్మించి, మరికొన్ని చోట్ల మధ్యలోనే పనులు ఆపేశారు. దీనివల్ల భారీ వర్షాలు కురిసినప్పుడు వర్షపు నీరు వెళ్లే మార్గం లేక సర్వీస్ రోడ్డుపై చెరువు మాదిరిగా నిలిచిపోతోంది.



కేవీ పాఠశాల ఎదురుగా సగం కట్టి వదిలేసిన కాలువ

దీంతో ఆ సమయంలో వాహనదారులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సాధారణంగా ప్రధాన సర్వీస్ రోడ్లపై నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది కాబట్టి, వర్షపు నీరు నిలవకుండా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలి. ఇందులో భాగంగానే సర్వీస్ రోడ్డుకు సమీపంలో కాలువ పనులు చేపడతారు. కానీ ఇక్కడ సగం పనులు చేసి వదిలేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అధికారుల నిర్లక్ష్యంపై అనుమానాలు

ఈ సమస్య జీవీఎంసీ ఉన్నతాధికారుల దృష్టిలో ఉన్నప్పటికీ, నేటికీ స్పందించకపోవడం వెనుక మర్మం ఏంటో అర్థం కావడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో రోజువారీ వర్షాలు కురిసినా సర్వీస్ రోడ్లపై నిత్యం నీరు నిలిచి ఉంటే ప్రజల పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై అధికారులు ఇప్పటికైనా స్పందించి, అసంపూర్తిగా ఉన్న కాలువ పనులను తక్షణమే పూర్తి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సేవా మార్గాలలో ప్రధానంగా నీరు నిలిచే ప్రదేశాలు

- మల్కాపురం పోలీస్‌స్టేషన్ ఎదురుగా గల సేవా మార్గం
- మల్కాపురం కేవీ పాఠశాల ఎదురుగా గల సేవా మార్గం
- హెచ్‌పీసీఎల్ సీ గేటు ఎదురుగా గల సేవా మార్గం
- మల్కాపురం పాత పెట్రోల్ బంక్ వద్ద గల సేవా మార్గాలు



మహాలక్ష్మి థియేటర్ ఎదురుగా ప్రారంభం కాని పనులు

పనులు ఆపేస్తే ఎలా?



పారిశ్రామిక ప్రాంత ప్రధాన సేవా మార్గాలలో ఫుట్‌పాత్‌లకు ఆనుకుని నిర్మించిన కాలువ పనులు సగం ,సగం చేశారు. కాలువ పనులు పూర్తి స్థాయిలో చేపట్టాలి. అలా అయితే సేవా మార్గంలో నీరు నిలవదు. ఈ సమస్యపై అధికారులు స్పందించి, పూర్తి స్థాయిలో కాలువ పనులు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి.

– రేవళ్ల సత్యనారాయణ, స్థానికుడు

వర్షాకాలంలో తీవ్ర ఇబ్బంది



వర్షాలు వచ్చినప్పుడు మల్కాపురం, ఆర్‌కేపురం, కేవీ పాఠశాల వద్ద గల సేవా మార్గాలపై వర్షం నీరు భారీగా నిలిచిపోవటంతో ఆ సమయంలో కనీసం ద్విచక్ర వాహనంపై వెళ్లలేని పరిస్థితి కలుగుతుంది. దీని వలన తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నాం.

– ఏదుర విక్రమ్‌యాదవ్, ఇంజినీరింగ్ విద్యార్థి

రేషన్ డిపోల వద్ద పడిగాపులు

గోపాలపట్నం: చెంతకు వచ్చే రేషన్ వాహనాలను నిలిపి వేయడంతో ప్రజలకు పడిగాపులు తప్పడం లేదు. చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ 91, 92, 89 వార్డుల పరిధిలో రేషన్ డిపోల వద్ద పేదలు ఇబ్బందులు పడ్డారు. ఉదయం సర్వర్ డౌన్ కావడం వల్ల ఎక్కువ మందికి సరకులు ఇవ్వలేదు. చాలా మంది వేచి ఉండలేక తిరిగి వెళ్లిపోయారు. పాత గోపాలపట్నం 91వ డిపో వద్ద ఎండలో నిల్చోవాల్సి వచ్చిందని వినియోగదారులు వాపోయారు. సర్వర్ ఇబ్బంది పెట్టడం వల్ల తంబ్ వేసే యంత్రం పట్టుకుని డీలర్ కూడా ఎండలోనే పని చేయాల్సి వచ్చింది.

రేషన్ డిపోల పునఃప్రారంభం

91, 92 వార్డుల్లో ప్రభుత్వ విప్ గణబాబు పలు రేషన్ డిపోలను పునఃప్రారంభించారు. పలువురికి రేషన్ సరకులు అందించారు.

నష్టాలకు కార్మికులను బాధ్యులను చేస్తారా?

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నష్టాలకు కార్మికులను బాధ్యులను చేయడం అన్యాయమని స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ప్రధానకార్యదర్శి డి. ఆదినారాయణ అన్నారు. ఉక్కు యాజమాన్యం కంపెనీ పరిస్థితులను ముఖ్యమంత్రికివివరించిన అంశాల్లో వాస్తవం లేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు దేశంలో ఎక్కడా లేని విధంగా రోజుకు ఎనిమిదిన్నర గంటలు పని చేస్తున్నారన్నారు. ప్లానింగ్ కమిషన్ నివేదిక మేరకు 3.2 మి. టన్నులకు 16,500 మంది పర్మినెంట్ ఉద్యోగులు అవసరమని చెప్పి నియామకాలు చేయడం జరిగిందన్నారు. విస్తరణలో 3 వేల మంది పర్మినెంట్ ఉద్యోగులు, 900 మంది అధికారులు, 4500 కాంట్రాక్ట్ కార్మికులను అదనంగా నియమించారన్నారు. అయితే యాజమాన్యం ఇప్పుడు ఉద్యోగులు ఎక్కువగా ఉండడం వల్లే నష్టాలు వస్తున్నాయని.. అందుకే కార్మికులను తొలగించాల్సి వస్తుందని చెప్పడం దుర్మార్గమన్నారు. 1800 మంది కార్మికులు పని చేయకుండా జీతాలు తీసుకుంటున్నారని, 300 మంది యు పాసులతో నాయకులుగా తిరుగుతున్నారని సీఎంకు చెప్పడం అవాస్తవమన్నారు. ఉక్కు కర్మాగారాన్ని లాభాల్లో తీసుకురావడానికి సాంకేతిక నిపుణులతో కమిటీ నియమించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఆత్మరక్షణకు కరాటే విద్య అవసరం



విన్యాసం చేస్తున్న చిన్నారి



ప్రతిభ చూపిన వారిని అభినందిస్తున్న కార్పొరేటర్ సురేష్

మల్కాపురం: ఆత్మరక్షణ కోసం కరాటే విద్యను అభ్యసించడం మంచిదే అని 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ అన్నారు. కరాటే కోచ్ జీ.శ్రీనివాసరావు(భరత్) ఆధ్వర్యంలో 59వ వార్డు మాజీ సైనిక కాలనీలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మైదానంలో ఆదివారం కరాటే పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కరాటే విద్య ఆత్మరక్షణకే కాకుండా దానిలో పట్టు సాధిస్తే పది మందికి శిక్షణ ఇచ్చే వారిగా ఎదగవచ్చునన్నారు. చదువుతో పాటు నచ్చిన క్రీడ, మార్షల్ ఆర్ట్స్‌లో చిన్నారులకు ప్రావీణ్యం ఉండాలన్నారు. ఈ సందర్భంగా పలు బెల్ట్‌లు సాధించిన చిన్నారులు చేసిన విన్యాసాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరాటే కోచ్‌లు బి.శ్రీనివాస్ రావు, నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ నియామక రాత పరీక్ష



కేంద్రం వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ బాబు

విశాఖ విద్య: ఏపీ పోలీస్ రిక్రూట్ మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ (సివిల్, ఏపీఎస్పీ) రాత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శ్రీప్రాద కాలేజీ, మహతి కాలేజీ , భాష్యం స్కూల్ లో పరీక్ష కేంద్రాలు కేటాయించారు. భాష్యం పరీక్ష కేంద్రం వద్ద సీఐ జి.డి బాబు బందోబస్తు పర్యవేక్షించారు. గంట ముందే పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు చేరుకున్నారు. హాల్ టికెట్, ఆధార్, ఇతర గుర్తింపు కార్డులు పరిశీలించి తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోనికి అనుమతించారు. సీసీ కెమెరాలు, పటిష్ట బందోబస్తు మధ్య ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరిగింది. మూడు కేంద్రాల్లో సుమారుగా 727 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. పరీక్ష కేంద్రాలను ఉన్నతాధికారులు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

ఒక్కో పరీక్ష కేంద్రం వద్ద సీఐ, ఎస్ఐ , ఏఎస్ఐ, పీసీలు, ట్రాఫిక్ సిబ్బందిని నియమించారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంచారు. సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించారు.

కార్మిక పక్షపాతి మస్తానప్ప

రాజ్యసభ సభ్యుడు గొల్లబాబూరావు



మస్తానప్ప చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాజ్యసభ సభ్యుడు బాబూరావు తదితరులు

ఉక్కునగరం: కార్మికులకు అండగా పోరాటాలు చేయడంతో పాటు వైఎస్సార్‌సీపీ బలోపేతానికి మస్తానప్ప చేసిన కృషి ఎనలేనిదని రాజ్యసభ సభ్యుడు గొల్లబాబూరావు అన్నారు. స్టీల్ వైఎస్సార్ టీయూసీ వ్యవస్థాపక ప్రధానకార్యదర్శి వై. మస్తానప్ప 61వ జయంతి సందర్భంగా వై.మస్తానప్ప మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉక్కునగరం క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ గొల్ల బాబూరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు, గాజువాక ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి, రాజమండ్రి పార్లమెంట్ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి పాల్గొని మస్తానప్ప చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కార్మిక సంఘం అభివృద్ధికి మస్తానప్ప చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 40 యూనిట్లు రక్తం సేకరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ వై. వరలక్ష్మి, వివిధ కార్మిక సంఘాల నాయకులు డి. ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, రామ్మోహన్‌కుమార్, డి.వి. రమణారెడ్డి, పరదేశి, సంపూర్ణం, పిట్టారెడ్డి, నమ్మి సింహాద్రి, ఎ. అప్పారావు, పల్లా పెంటారావు, చంద్రశేఖర్ శకునాల, బి. సాయి, నవీన్‌కుమార్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణోత్సవం



శంకరమఠంలో నిర్వహిస్తున్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణం

సీతంపేట: శ్రీ శరవణ భవ సంస్థాన్ ఆధ్వర్యంలో ఆదివారం శంకరమఠంలో వల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత గణపతి పూజ, పుణ్యాహవచనంతో ప్రారంభించి మండపారాధన, కల్యాణమూర్తులకు స్నపన తిరుమంజనం, అనంతరం కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా శ్రీ శరవణ భవ సంస్థాన్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ కల్యాణం ద్వారా అపమృతు దోషాలను పోగొట్టి జీవితంలో యువతకు మంచి నడవడికను, ఆరోగ్యాన్ని ప్రసాదించాలని వేడుకుంటున్నట్లు తెలిపారు. ధర్మ సంస్థాపన కేవలం సుబ్రహ్మణ్య ఆరాధన వల్ల పునరావృతం అవుతుందన్నారు. ఇప్పటి వరకు సంస్థ ద్వారా 85 కల్యాణ మహోత్సవాలు నిర్వహించామని చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో కల్యాణాన్ని వీక్షించారు. కార్యక్రమంలో శంకరమఠం అధ్యక్షుడు డాక్టర్ రవిరాజు, కార్యదర్శి అచ్యుతరామయ్య, డాక్టర్ విద్యాసుధ పాల్గొన్నారు.

అన్నింటా కూటమి విఫలం

- సూపర్ సిక్స్ హామీలు గాలికి వదిలేశారు
- మాట తప్పడం చంద్రబాబు నైజం
- ఇప్పటికైనా హామీలు నెరవేర్చాలి
- లేకుంటే ప్రజా ఉద్యమం తప్పదు
- 4న 'వెన్నుపోటు దినం'
- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న మళ్ల విజయప్రసాద్

మల్కాపురం : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా, ప్రజలకు ఇచ్చిన హామీలను నేటికీ నెరవేర్చకపోవడం దారుణమని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పారిశ్రామిక ప్రాంతని పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంస్థల ప్రతినిధులతో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

ఉద్యోగాలు ఇవ్వకపోగా, ఉన్న ఉద్యోగాలకూ ఎసరు

తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్ ద్వారా 20 లక్షల ఉద్యోగాలు, ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ. 3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్‌లు నమ్మించారని మళ్ల విజయప్రసాద్ గుర్తుచేశారు. అయితే, నేడు ఎండీయూ వాహనాలలో పనిచేస్తున్న వారి ఉద్యోగాలకు, వలంటీర్ల ఉద్యోగాలకు, విద్యుత్ మీటర్ల రీడింగ్ తీసే వారి ఉద్యోగాలకు గుదిబండ వంటి పరిస్థితిని కల్పించారని ఆయన ఆరోపించారు. ఉద్యోగాలు ఇవ్వకపోగా, ఉన్న ఉద్యోగులనూ తొలగిస్తున్నారని ఆయన విమర్శించారు.

సూపర్ సిక్స్ అమల్లో విఫలం

తల్లికి వందనం, ఉచిత గ్యాస్, ఉచిత బస్సు వంటి సూపర్ సిక్స్ హామీలను సైతం అమలు చేయలేక కూటమి నాయకులు చేతులెత్తేసే పరిస్థితిని కల్పిస్తున్నారని మళ్ల విజయప్రసాద్ ధ్వజమెత్తారు. వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన ఆరు నెలలకే నవరత్నాల పేరుతో పథకాలు అన్నింటినీ అమలు చేసి దమ్మున్న నాయకుడని రుజువు చేసుకున్నారని ఆయన ప్రశంసించారు. కరోనా వంటి కష్టకాలంలో కూడా ఎక్కడ సంక్షేమ పథకాలను నిలపలేదని వివరించారు.

రేషన్ పంపిణీ, గృహ నిర్మాణం, ఇసుక పాలసీపై విమర్శలు

జగన్ ప్రభుత్వంలో ఇంటి వద్దకే రేషన్ సరుకులు అర్హులైన వారికి అందేవని, నేడు ఆ పరిస్థితి లేదని, పూర్వం మాదిరిగానే రేషన్ డిపోల చుట్టూ ప్రజలు ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని మళ్ల విజయప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన వారికి ఇంటి పట్టాలు నేటికీ ఇవ్వలేదని, టిడ్కో ఇళ్లకు నేటికీ మోక్షం కల్పించలేదని, ఉచిత ఇసుక బదులు ఇసుక కొరత ఏర్పడిందని ఆయన ఆరోపించారు. కూటమి తన ఏడాది పాలనలో అనేక ప్రజా వ్యతిరేక పనులు చేపట్టి ప్రజలలో తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుందని వివరించారు.



సమావేశానికి హాజరైన కార్యకర్తలు, నాయకులు

4న 'వెన్నుపోటు దినం' విజయవంతం చేద్దాం

ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలం కావడంతో ఈ నెల 4వ తేదీన 'వెన్నుపోటు దినం' చేపడుతున్నట్లు మళ్ల విజయ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కూటమి పాలనపై తమ వ్యతిరేకతను చాటాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు పీవీ సురేష్, గులిగిందల లావణ్య, గుండపు నాగేశ్వర రావు, బల్లా లక్ష్మణరావు, పలు వార్డుల పార్టీ అధ్యక్షులు రేవళ్ల సత్యనారాయణ, జీవీఎస్ఎన్ రాజు (కేబుల్ వాసు), గులిగిందల కృష్ణ, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అనీల్‌కుమార్, మహిళా నాయకురాలు చుక్క వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన డ్యాన్స్ పోటీలు

సీతంపేట: స్నేహాంజలి డ్యాన్స్ స్కూల్ సమ్మర్ క్యాంప్ ముగింపు సందర్భంగా ఆదివారం ద్వారకా నగర్ పౌర గ్రంథాలయంలో డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. సుమారు నెల రోజుల పాటు స్కూల్‌లో నేర్చుకున్న డ్యాన్స్‌ను విద్యార్థులు ప్రదర్శించి అలరించారు. కూచిపూడి, భరత నాట్యం, వెస్ట్రన్, ఫోక్ డ్యాన్స్‌ల్లో శిక్షణ పొందిన చిన్నారులు పాటలు, మ్యూజిక్‌కు తగ్గట్టు స్టెప్పులేసి అదరగొట్టారు. అనంతరం ప్రతిభ చూపిన చిన్నారులకు నిర్వాహకులు జ్ఞాపికలు అందజేశారు.

రైల్వే ఆస్పత్రిలో పారిశుధ్య పనుల విభాగం

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజనల్ రైల్వే ఆస్పత్రిలో అధునాతన, పరిశుభ్రమైన మెకానికల్ క్లీనింగ్ సిస్టంను వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా, ఈకార్వో ప్రెసిడెంట్ జ్యోత్స్న బోరా వైద్యాధికారులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఆస్పత్రి పరిసరాల పరిశుభ్రత కోసం మొదటిసారిగా ఈ పనులను ప్రైవేటు సంస్థ (సింగూరి నాగేశ్వరావు ఏజెన్సీ)కి మూడేళ్ల కాలవ్యవధితో కాంట్రాక్టు అప్పగించారు. సుశిక్షితులైన 39 మంది సిబ్బంది అధునాతన మెకానికల్ సిస్టంతో నిరంతరం ఆస్పత్రిని వీరు పరిశుభ్రంగా ఉంచుతారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం(ఇన్‌ఫ్రా) ఇ. శాంతారాం, చీఫ్ ఇంజినీర్ (కన్‌స్ట్రక్షన్) డి. శ్రీనివాసరావు, సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ ప్రవీణ్ భటి, రైల్వే ఆస్పత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శరత్‌బాబు, ఏసీఎంఎస్ డాక్టర్ చారుమతి, పర్సనల్ ఆఫీసర్ జూసుఫ్ కబీర్ అన్సారీ పాల్గొన్నారు.



హౌస్ కీపింగ్ పనులను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం లలిత్‌బోరా, ఈకార్వో ప్రెసిడెంట్ జ్యోత్స్న

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ఫోర్త్ టౌన్ ఎస్ఐ చిన్నంనాయుడు

తాటిచెట్లపాలెం: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్ఐ చిన్నం నాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఎటువంటి గొడవలు, కొట్లాటల్లో తలదూర్చ కూడదని, మంచిగా నడుచుకుని, కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలన్నారు. హద్దు మీరితే ఉపేక్షించేది లేదని రౌడీషీటర్లను ఎస్ఐ హెచ్చరించారు.